క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



నాయకపుగూడలో విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుంటున్న ఎంఈవో

కాసిపేట: మండలంలోని సోనాపూర్, నాయకపుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో వాసాల ప్రభాకర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సామర్థ్యాలు రిజిస్టర్లను పరిశీలించారు. వందశాతం హాజరు నమోదుతోపాటు విద్యార్థులకు చదవడం, రాయడం వచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. హెచ్‌ఎంలు జసింత, జ్యోతి, సీసీవో రాంబాబు తదితరులు ఉన్నారు.

చదువుపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న సౌజన్య

భీమారం: విద్యార్థినులు చదువుపై శ్రద్ధ పెట్టాలని జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ సౌజన్య పేర్కొన్నారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు గురువారం బాల రక్షాభవన్ అందించే సేవలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నిజం చేసేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థినులు తెలుసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా చైల్డ్ లైన్ నంబర్ 1098కి ఫోన్ చేయాలన్నారు. స్పెషలిస్ట్ విజయ, పాఠశాల ప్రత్యేక అధికారి కనకలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ఏరియాల్లో గంజాయి తాగి పట్టుబడిన పలువురిని కుటుంబ సభ్యుల సమక్షంలో సీఐ శశిధర్‌రెడ్డి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 13 గంజాయి మొక్కలు గుర్తించి, సుమారు 3.5 కిలోల గంజాయి పట్టుకున్నామని తెలిపారు. వీటిని అమ్మకాలు, విక్రయాలు చేసేవారిపై కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి తాగి పట్టుబడితే జైలుకెళ్లడం ఖాయమన్నారు. గంజాయి నివారణ కోసం ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఒకరిపై కేసు

భీమిని: సోషల్‌మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్న ఒకరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌కు చెందిన మాధవరపు నర్సింగరావు, తన అనుచరులతో కలిసి పేదల భూములు కబ్జా చేసి, డబ్బులు తీసుకుని సెటిల్‌మెంట్ చేస్తున్నారని బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి రత్నం సోను వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గుంతలు పూడ్చివేత



పూడుస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: పట్టణంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో, స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాలతో గురువారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు కలిసి గుంతలు పూడ్చారు.

యాదవహక్కుల పోరాట సమితి కన్వీనర్‌గా రామయ్య

బెల్లంపల్లిరూరల్: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా బేరె రామయ్య యాదవ్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య యాదవ్ గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. సంఘం బలోపేతానికి, యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రామయ్యయాదవ్ తెలిపారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. స్థానికుల పాట్లు

- పిచ్చిమొక్కలు పెరిగి దోమల బెడద
- నిలిచిన మురుగునీటితో దుర్గంధం
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



శ్రీనివాస కాలనీలోని ఖాళీస్థలంలో నిలిచిన డ్రెయినేజీ, వర్షపు నీరు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలో ఇళ్ల మధ్య ఖాళీప్లాట్లు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి. ఈ ప్లాట్లు చెత్తకుపంగా మారుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు 50కి పైగా ఖాళీ ప్లాట్లలో నీరు నిలుస్తుండడం, పెరిగిన పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. పాములు, పందులకు ఆవాసంగా మారుతున్నాయి. ఏటా వర్షాకాలం ముందు డ్రెయినేజీల్లో చెత్త తొలగించి, మురుగు నీరు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నా, ఖాళీ స్థలాల యజమానులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడంతో, శివారు ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు ఏర్పడుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టడం లేదు. వర్షపు నీరు, మురుగు నీరు రహదారిపై చేరి ఖాళీ ప్లాట్లలో నిలుస్తోంది.

శివారు ప్రాంతాల్లో..

మంచిర్యాల జిల్లాగా మారిన తర్వాత పట్టణం వేగంగా విస్తరిస్తోంది. వికాస్‌నగర్, లక్ష్మీనగర్, పాత మంచిర్యాల, మధురానగర్, రంగంపేట్, శ్రీనివాస కాలనీ, పవర్‌సిటీ కాలనీ, గోపాల్‌వాడ, రాజీవ్‌నగర్, తిలక్‌నగర్, చున్నంబట్టివాడ, సాయికుంట, గ్రీన్‌సిటీ కాలనీ, శ్రీశ్రీనగర్ కాలనీల్లో కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటుండగా, మిగతా వారు ప్లాట్లను ఏళ్ల తరబడి అలాగే ఉంచుతున్నారు. ఇళ్ల నిర్మాణాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు, వర్షపు నీరు చేరి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. స్థానికంగా ఉండే కాలనీవాసులు సైతం



చున్నంబట్టివాడలోని ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు

చెత్తాచెదారాన్ని ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. ఆ ప్రాంతం ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారంతో నిండి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ ప్లాట్లలో శుభ్రం చేయాలని యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఖాళీ ప్లాట్లలో చెత్తాచెదారం యజమానులు శుభ్రం చేసేలా అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు, మురుగు నీరు తొలగించేలా యజమానులకు నోటీసులు జారీచేస్తాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి ఉన్నచోట దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. ఖాళీ ప్లాట్లలో శుభ్రం చేసేలా తగిన చర్యలు తీసుకుంటాం. – మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

గర్భిణికి వరద కష్టాలు



గర్భిణిని వరదలో నుంచి కాలినడకన తీసుకొస్తున్న వైద్య సిబ్బంది

వేమనపల్లి: ప్రాణహిత వరద గ్రామాలను చుట్టుముట్టడంతో మండలంలో రాకపోకలకు కష్టాలు మొదలయ్యాయి. జాజులపేట గ్రామానికి చెందిన గర్భిణి దందెర భారతికి ఆగస్టు మొదటి వారంలో ప్రసూతి తేదీని వైద్యులు నిర్ణయించారు. ముందు జాగ్రత్తగా ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు హెల్త్ అసిస్టెంట్ బాపు, ఆశ కార్యకర్త శారద వరదలో నుంచి గ్రామానికి వెళ్లారు. ఆటో సహాయంతో సుంపుటం అట్టలొర్రె వంతెన వద్దకు రాగా గంటల వ్యవధిలోనే వరద తీవ్రత పెరిగింది. వేమనపల్లి 108 అంబులెన్స్ సైతం అట్టలొర్రె వంతెన వద్దకు వచ్చి ఆగిపోయింది. దీంతో ఎస్సై శ్యాంపటేల్ వైద్య సిబ్బంది అంబులెన్స్ ఈఎంటీ రమేష్, పైలెట్ ఇమామ్ షరీఫ్ సాయంతో కాలినడకన జాగ్రత్తగా వరదలో వంతెన రోడ్డు మీదుగా గర్భిణిని బయటకు తీసుకొచ్చారు. అక్కడే ఉన్న అంబులెన్స్ సహాయంతో చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పగిలిన భగీరథ పైప్‌లైన్



పగిలిపోయిన చోట చేరిన నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట పునరావాస కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కనే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ గురువారం పగిలింది. దాదాపు 3 గంటలకు పైగా నీరు వృథాగా పోయింది. వారం క్రితం ఇక్కడే పైప్‌లైన్ పగలిపోగా సిబ్బంది తూతూమంత్రంగా మరమ్మతు చేసి వెళ్లిపోయారు. మళ్లీ నాలుగు రోజులకే పైప్ పగిలిపోయింది. మరమ్మతు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పీఆర్టీయూతో సమస్యలు పరిష్కారం

జన్నారం: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం మండల అధ్యక్షుడు కట్ల రాజమౌళి అన్నారు. మండలంలోని కిష్టాపూర్, రేండ్లగూడ, జన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్ కోసం సంఘం కృషి చేసిందన్నారు. త్వరలో 317 జీవో బాధితుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లాల నాయకులు పిట్టల రాజరావు, ప్రవీణ్‌కుమార్, గుండరాజన్న, చంద్రశేఖర్, రాజేందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణ

కోటపల్లి: ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆకుల భూమన్న అనారోగ్యంతో సెలవులో వెళ్లారు. ఎంపీవో సత్యనారాయణకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

వర్షానికి కూలిన గుడిసె



కూలిన గుడిసె ఎదుట వృద్ధ దంపతులు

నెన్నెల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని గంగారాం గ్రామానికి చెందిన నల్లూరి వీరమల్లు, లక్ష్మి దంపతుల గుడిసె గురువారం కూలిపోయింది. దీంతో నిరుపేద వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. మూడేళ్ల క్రితమే వృద్ధురాలి కంటిచూపు పోయింది. ఆసరా పెన్షన్‌తోనే పొట్టగడుపు కొంటూ నెట్టుకొస్తున్నారు. ఉన్న ఒక్క కొడుకు తాగుడుకు బానిసై వారిని పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. గుడిసె కూలడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేసే దాతలు 85209 76050 నంబర్‌కు ఫోన్ పే చేయాలి.

లాడ్జిలో పోలీసుల తనిఖీ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఉన్న ఓ రెసిడెన్సీ లాడ్జీలో గురువారం రాత్రి మంచిర్యాల పోలీసులు తనిఖీ నిర్వహించారు. ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. లాడ్జీలో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసలు రైడ్ చేశారు. ముగ్గురు మహిళలు, లాడ్జి యజమాని సిరిపురం శ్రీనివాస్‌తోపాటు బెల్లంపల్లికి చెందిన తిప్పరవేణి అఖిల్, హాజీపూర్ మండలం టీకానపల్లికి చెందిన మేడిపట్ల అరుణ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, శ్రీనివాస్ ఓ పార్టీలో కీలకంగా వ్యవహరించడంతో కేసు నుంచి తప్పించేందుకు పలువురు ప్రముఖులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఇసుక లారీ పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులో ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి లారీని హాజీపూర్ పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలి

నస్పూర్:పట్టణంలోని అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టాపాస్ పుస్తకం ఉండి 18 నుంచి 59 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 5 తేదీలోగా రైతులు తమ ధ్రువపత్రాలతో ఏఈవోకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీపీవో

చెన్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాల, వంట గది, పరిసరాలతోపాటు రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డీపీవో మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ప్రిన్సిపాల్ ఉన్నారు.

చెన్నూర్‌రూరల్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీపీవో వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ శానిటేషన్, క్లోరినేషన్ నిర్వహణ, ఇంటింటికీ చెత్త సేకరణ, తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలన్నారు. ప్రతీ పంచాయతీల్లో మొక్కలు పంపిణీ చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మల్టీలేయర్ ప్లాంటేషన్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. అంతకుముందు కత్తెరసాలలో శానిటేషన్, క్లోరినేషన్ పనులు పరిశీలించారు. గ్రామంలో ప్రతీరోజు చెత్త సేకరణ, కంపోస్టు నిర్వహణ చేపట్టాలని కార్యదర్శి ప్రసాద్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని పాల్గొన్నారు.

వాగు దాటి.. భూమి సర్వే చేసి



తహసీల్దార్‌ను వాగు దాటిస్తున్న రైతులు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి శివారులో భూమి సర్వే కోసం తహసీల్దార్ భోజన్న గురువారం వాగు దాటారు. సింగరేణి ఓపెన్‌కాస్టుకు సంబంధించి వివాదాస్పద భూమి 27 ఎకరాల్లో సర్వే చేపట్టారు. పట్టాదారులు, కాస్తు(కబ్జా)లో ఉన్న రైతులను గుర్తించి వివరాలు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఎంఆర్ఐ స్వేత, సర్వేయర్ రాజశేఖరాచారి, స్థానిక రైతులు ఉన్నారు.

యాదవ కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయించాలి

పాతమంచిర్యాల: యాదవ కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 శాతం జనాభా ఉన్న యాదవులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రి వర్గంలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గొర్రెల,మేకల పెంపకందారుల సొసైటీలు ఏర్పాటు చేయాలన్నారు. రెండోవిడత గొర్రెల పంపిణీ చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరవేన సంపత్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న, జిల్లా అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

దొనబండ పశువైద్యురాలి బదిలీ



సరిత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ పశువైద్యురాలు సరిత బదిలీ అయ్యారు. 12 ఏళ్లుగా హాజీపూర్ మండలంలో విధులు నిర్వహించిన ఆమె కాసిపేట మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కన్నెపల్లి మండలం పశువైద్యశాల హారిక బదిలీపై వచ్చారు. దొనబండ పశు వైద్యశాల వీఏ స్వప్న గూడెంకు బదిలీ కాగా ఆమె స్థానంలో బదిలీపై మంచిర్యాల నుంచి రవళి వచ్చారు. ఆఫీస్ సబార్డినేట్‌గా మంచిర్యాల నుంచి లక్ష్మి దొనబండకు బదిలీపై వచ్చారు. రాపల్లి పశువైద్యశాల సబ్ సెంటర్ ఎల్ఎస్ఏ అగ్నివేశ్ ముల్కల్లకు, ఆఫీస్ సబార్డినేట్ నారాయణ మంచిర్యాల జిల్లా కార్యాలయానికి బదిలీ అయ్యారు.

వాహన తనిఖీలు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాసిపేటలో, సోమగూడెం చౌరస్తా వద్ద గురువారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జరిమానా విధించిన వాహనదారులతో ట్రాఫిక్ నిబంధన పోస్టర్, ప్లకార్డులు ఇచ్చి అవగాహన కల్పించారు.

బదిలీపై వెళ్లిన టీచర్లకు సన్మానం

చెన్నూర్: పట్టణంలోని కొటబొగుడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బిల్లా తిరుపతయ్య పదోన్నతిపై కోటపల్లికి, మోతె సునీత ఎనగుట్టకు బదిలీ అయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, ఎంఈవో రాధాకృష్ణమూర్తి గురువారం సన్మానించారు. కౌన్సిలర్ పోగుల సతీశ్, కాలనీవాసులు సత్తయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం



భీమిని: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయం ఉరుస్తోంది. 2016లో కన్నెపల్లి మండల కేంద్రం ఏర్పాటైంది. తహసీల్దార్ కార్యాలయానికి ప్రభుత్వ పాత శాల భవనం కేటాయించారు. కార్యాలయం పైకప్పు పెచ్చులూడి వర్షపు నీరు చేరుతోంది. గదుల్లో రికార్డులు తడిసిపోయే పరిస్థితి నెలకొంది. అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

బెల్లంపల్లికి బస్‌డిపో మంజూరు చేయాలి



ఎమ్మెల్యే వినోద్‌కి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లికి ఆర్టీసీ బస్‌డిపో మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్‌డిపో ఏర్పాటుతో నియోజకవర్గ పరిధిలోని గ్రామీణులకు రవాణా సౌకర్యం సులభతరం అవుతుందని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను పాత సీఎస్‌పీ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బెల్లంపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ కౌన్సెలర్ పొట్ల సురేష్, కాంగ్రెస్ బెల్లంపల్లి, తాండూర్ మండలాల అధ్యక్షులు సత్యనారాయణ, ఎండీ ఈసా, నాయకులు వెంకటేశ్, రాము తదితరులు ఉన్నారు.

ఆటో యూనియన్ల లొల్లి

- ఇరువర్గాల మధ్య విభేదాలు
- ఏసీపీ వద్దకు చేరిన పంచాయితీ

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఆటోడ్రైవర్, ఓనర్స్ యూనియన్ల ఎన్నికల లొల్లి కొన్నిరోజులుగా నడుస్తోంది. వీరి మధ్య సయోధ్య కుదరక కొందరు విడిపోయి నెల క్రితం కొత్త కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 26న పాత యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం కాగా, రెండు కమిటీలు కాదు ఒక్కటే ఉండాలని కొత్త కమిటీ సభ్యులు పాత కమిటీ సభ్యులకు చెప్పారు. గత 25 ఏళ్ల నుంచి నడుస్తున్న యూనియన్ ఇది, ఇప్పుడు అందరూ కలిసి రాజకీయాలకతీతంగా ఎన్నికలు నిర్వహిద్దామని చెప్పడంతో ఇరువర్గాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఎట్టకేలకు ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఏసీపీ ప్రకాశ్ ఇరు వర్గాలను పిలిపించినట్లు తెలిసింది. ఈ విషయమై ఏసీపీని వివరణ కోరగా కొత్తగా ఎన్నికైన కమిటీని విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తున్నారని పాత ఆటో యూనియన్ అధ్యక్షుడు పొట్ట మధుకర్, మరికొందరిపై ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బడ్జెట్‌లో విద్యారంగంపై చిన్నచూపు

జన్నారం: అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగంపై చిన్నచూపు చూడటం సిగ్గుచేటని తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21,292 కోట్లు (7.31శాతం) కేటాయించడం సరికాదన్నారు. బడ్జెట్ సవరించి 30 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

చెన్నూర్: వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని 1, 2వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు సతీశ్, శ్రీనివాస్ గురువారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా సభ్యులు ఉన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో మధుసూదన్ పేర్కొన్నారు. నంనూర్ గ్రామంలోని చందనాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చిన్నారులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. హెచ్‌ఎం శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి

కోటపల్లి: డ్రగ్స్ నిర్మూలనకు యువత సహకరించాలని ఎస్సై రాజేందర్ కోరారు. రాంపూర్, కొల్లూర్ గ్రామాల్లోని యువతకు డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలను తమ వెంట తెచ్చుకోవాలన్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: ఎలాంటి అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రైవేట్ పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. శ్రీకాంత్, అభినవ్, అరవింద్‌రెడ్డి, సన్నీగౌడ్, కుతూబ్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

కాసిపేట: సింగరేణిలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై నిర్వహించిన పిట్ సేఫ్టీ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించాలన్నారు. పనిలో రక్షణ నియమాలు పాటిస్తున్న ట్రామర్ వెంకటేశ్‌ను అభినందించారు. గని రక్షణాధికారి సునీల్‌కుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ సెక్రెటరి మినుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ఏకలవ్య ఆశ్రమంలో గురువారం మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్‌లు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. మమత అధ్యక్షురాలు రాచకొండ మంజుల కృష్ణారావు, కార్యదర్శి లత, కోశాధికారి నాగమణి, జ్యోత్స్న చంద్రదత్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



మంచిర్యాలటౌన్: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం గోరింటాకు సంబరాలు జరుపుకొన్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, జిల్లా కార్యదర్శి పెరిసింగుల వాణిశ్రీ, మంచిర్యాల పట్టణ అధ్యక్షురాలు కొండవీటి తిరుమల, పచ్చ స్వప్న, గోమాస కమల, కమ్మల హిమాస్థలి, ఆకుల మంజుల, సీహెచ్ రమ్య, రాపల్లి పూజ, కట్ట రజని, పాతల శ్రీలత, వేముల సరస్వతి, జమ్మిడ వెంకటమ్మ, తోట పద్మ, ఆరెందుల లావణ్య పాల్గొన్నారు.